క్లుప్తంగా

రేషన్‌డీలర్లు సమయపాలన పాటించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్

కోటపల్లి: రేషన్‌డీలర్లు సమయపాలన పాటించాలని తహసీల్దార్ సునీల్ దేశ్‌పాండే అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గతనెలలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో రేషన్ బియ్యం పక్కదోవ పట్టిస్తున్నారని సర్పంచులు, ఎంపీటీసీలు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో గురువారం రేషన్‌డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. డీలర్లకు ఎలాంటి అవకతవకలకు పాల్పడొద్దని సూచించారు. సమావేశంలో ఎంపీపీ మంత్రి సురేఖ, రామయ్య, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు అజ్గర్ మోహియోద్దీన్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆర్ఆర్ఆర్ కేంద్రాలు ఏర్పాటు

నస్పూర్: పట్టణంలోని ప్రజలు వాడి పారేసిన పాత వస్తువుల సేకరకు సింగపూర్ పాత గ్రామ పంచాయతీ కార్యాలయం, నస్పూర్ మున్సిపల్ కార్యాలయంలో ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్, రీయూస్, రీ సైకిల్) కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు వినియోగించిన ప్లాస్టిక్ వస్తువులు, దుస్తులు, ప్లాస్టిక్ కవర్లు, ఇతర నిరుపయోగమైన వస్తువులు ఆర్ఆర్ఆర్ కేంద్రాల వద్ద ఇవ్వవచ్చునని ఆయన తెలిపారు. ఈ కేంద్రాలు జూన్ 5 వరకు అందుబాటులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

ప్రైవేట్ బిల్డింగ్ పనులకు పంచాయతీ ట్రాక్టర్



భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ బిల్డింగ్ పనులకు పంచాయతీ ట్రాక్టర్‌ను వినియోగిస్తున్నారు. గ్రామంలో అభివృద్ధి పనులకు వినియోగించాల్సిన పంచాయతీ ట్రాక్టర్ ఇలా ప్రైవేట్ పనులకు వినియోగించడంపై పలువురు గ్రామస్తులు మండిపడుతున్నారు. కన్నెపల్లి గ్రామంలో చనిపోయిన వ్యక్తుల బంధువులు స్నానాలకు పంపించాల్సిందిగా వారి బంధువులు కోరుతున్నప్పటికీ అలా పంపకపోవడంతో పాటు ప్రైవేట్ కార్యక్రమాలకు ట్యాంకర్‌ను వినియోగించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రైవేట్ పనులకు కాకుండా ప్రభుత్వ కార్యక్రమాలకు వినియోగించాలని పలువురు కోరుతున్నారు.

రేపు రక్తదాన శిబిరం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల రెవెన్యూ అధికారులు, తహసీల్దార్, సిబ్బంది ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీ ఉదయం 9:30గంటల నుంచి టీఎన్జీవోస్ ఫంక్షన్‌హాల్, లక్ష్మీ థియేటర్ సమీపంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రాజేశ్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వచ్ఛందంగా రక్తదానం చేసే వారు ముందుకొచ్చి, శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఐదో వార్డులో ఐదు పందులు మృతి

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో పందుల మృత్యువాత ఆగడం లేదు. ఐదో వార్డు నంబర్ 2ఇంక్‌లైన్ బస్తీలో సంచరిస్తున్న పందుల్లో గురువారం 5పందులు అకాల మృతి చెందాయి. ఈ బస్తీలో రోజువారీగా పందుల మృత్యువాత జరుగుతూనే ఉంది. విచ్చలవిడిగా మృతి చెందుతున్నా పందుల వల్ల ప్రజారోగ్యానికి భంగం కలుగకుండా మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు ఎనగందుల వెంకటేష్ డిమాండ్ చేశారు. పందులకు వచ్చిన వ్యాధి ఏంటో నిర్ధారణ చేయించి ప్రజల్లో నెలకొన్న భయాందోళన తొలగించాలని పేర్కొన్నారు.

భిక్షాటనతో వీవోఏల నిరసన



దండేపల్లి: వీవోఏలు తమ సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా దండేపల్లిలో గురువారం భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని, అప్పటివరకు సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



పచ్చిరొట్ట.. పంటకు మేలు



పంటలు సాగు చేస్తున్న భూముల్లో భూసారం వృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏళ్ల తరబడి నుంచి రసాయనిక ఎరువులు వేసి పంటలు సాగు చేస్తుండటం వల్ల సహజంగానే నేల సహజత్వాన్ని, స్వభావాన్ని కోల్పోతుంది. ఆ తీరుగా రూపాంతరం చెందిన భూముల్లో పంట దిగుబడి తగ్గిపోయి నిర్జీవంగా మారడానికి అవకాశాలు ఉంటాయి. భూమి స్వభావాన్ని కోల్పోకుండా ఉండేందుకు వీలైనంత వరకు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవాలి. మరీ ముఖ్యంగా ఏటా క్రమం తప్పకుండా సేంద్రియ ఎరువులను పొలాల్లో పోసుకోవాలి. జీలుగ, జనుము, పెసర వంటి పచ్చిరొట్ట ఎరువులను సాగు చేయడం వల్ల ప్రయోజనాలు ఉంటాయని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.రాజేశ్వర్‌నాయక్ తెలిపారు. పచ్చిరొట్ట ఎరువుల ప్రాధాన్యత, భూసారాన్ని పెంపొందించుకునే పద్ధతులను విషదీకరించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

బెల్లంపల్లి: మారుతున్న కాలానుగుణంగా పంటల సాగులోనూ పెనుమార్పులు వచ్చాయి. చీడపీడలు, తెగుళ్ల నివారణకు విచ్చలవిడిగా రసాయనిక ఎరువులను వినియోగించడానికి సిద్ధపడుతున్నారు. భూసారం దెబ్బ తీసే విధంగా వ్యవహరిస్తున్నారు. ఆదిలో రైతులు వ్యవసాయంతోపాటు పాడికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. పశువుల నుంచి వచ్చే ఎరువులను విధిగా పంటపొలాల్లో ఉపయోగించేవారు. తద్వారా భూమిలో వేసిన పైరుకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. పంట ఉత్పత్తిలో అధిక దిగుబడి రావడంతో పాటు భూసారం పెరగడానికి తోడ్పడేది. కొన్నాళ్ల నుంచి ఆ ఆనవాయితీని తప్పారు. గ్రామాల్లో గణనీయంగా పశు సంపద తగ్గుముఖం పడుతోంది. ఈ పరిణామాలతో పశువుల ఎరువు ఆశించినంతగా లభ్యం కాని ప్రతికూల పరిస్థితులు ఏర్పడగా, మరోపక్క రసాయనిక ఎరువుల వాడకం రెట్టింపైంది. పంటల సాగులో విచక్షణ రహితంగా రసాయనిక ఎరువులను వినియోగించడం మూలంగా, నేల భౌతిక లక్షణాలు దెబ్బతిని నీటిని నిల్వ చేసే సామర్థ్యాన్ని క్రమంగా కోల్పోతుంది. పర్యావరణ, జల కాలుష్యం కూడా పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో రైతులు తప్పక జీలుగ, జనుము, పెసర వంటి పచ్చిరొట్ట పంటలను సాగు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రహించాలి. ఆ విధంగా చేయడం వల్ల నేల స్వభావం సారవంతమై నీటిని నిల్వ ఉంచుకునే సామర్థ్యాన్ని పెంచుకుని పైరు ఎదుగుదలకు దోహదం చేస్తుంది.

విత్తుకునే సమయం..

పచ్చిరొట్ట పైర్లను తొలకరి వర్షాలు ప్రారంభంతోనే నాటుకోవాలి. బోర్లు, వ్యవసాయ బావుల ఆధారంగా మే-జూన్‌లో నాటుకోవడం చేయాలి. భూమిలో నత్రజని స్థిరీకరణ పచ్చిరొట్ట, పైరుదశపైన ఆధారపడి ఉంటుంది. సాధారణ దిగుబడి రావడానికి 45రోజుల సమయం పడుతుంది. పూతదశలో కలియ దున్నడం వల్ల నేలకు అత్యధిక సత్తువ వస్తుంది. పప్పుజాతి పచ్చిరొట్ట పంటలు వాతావరణంలో నత్రజని గ్రహించి వాటి వద్ద నిల్వ చేసుకుంటాయి.

రెండు విధాలుగా..

పచ్చిరొట్ట ఎరువులను భూమికి రెండు విధాలుగా అందించడానికి అవకాశాలు ఉన్నాయి. పచ్చి ఆకు ఎరువులు, పచ్చిరొట్ట ఎరువుల రూపేణా వినియోగించవచ్చు. పచ్చిఆకు ఎరువులు ప్రధానంగా కానుగ, గ్లైరిసిడియా, సీమ తంగేడు, అవిశ, వెంపలి వంటి మొక్కల ఆకులను కోసుకొచ్చి పొలంలో తొక్కి వేయడం. జనుము, జీలుగ, అలసంద, పెసరవంటి పంటలను పూత దశ వరకు పెంచి ఆ తర్వాత నేలలో కలిపి దున్నడాన్ని పచ్చిరొట్ట ఎరువులుగా పేర్కొనవచ్చు.

లాభాలు

- జీలుగ, జనుము, అలసంద, పెసర వంటి పచ్చిరొట్ట ఎరువుల వల్ల ఎకరానికి మూడు టన్నుల పచ్చిరొట్ట ఎరువు లభించటానికి అవకాశాలు ఉంటాయి.
- వేర్లలో నత్రజని స్థిరీకరణ అధికంగా ఉండి రెండుశాతం నత్రజని, సూపర్‌పాస్ఫేట్ అధనంగా అందిస్తాయి.
- జింక్, మాంగనీస్, ఇనుము, కాల్షియం వంటి సూక్ష్మ ధాతువులు పంటకు పుష్కలంగా అందుతాయి.
- నేలలో కరగని మూలకాలను పంటకు అనుకూలంగా మార్చుతుంది.
- భూమిలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది.
- నేల సహజమిత్రులైన వానపాముల ఉత్పత్తికి దోహదం చేస్తుంది.
- తుంగ, గరిక వంటి కలుపు మొక్కలను అడ్డుకుని పంటకు మేలు చేకూరుస్తుంది.
- పచ్చిరొట్ట ఎరువుల వాడకం వల్ల చౌడు భూములు సారవంతంగా తయారు కావడానికి వీలు కలుగుతుంది.

క్రీడలు

విద్యార్థులకు అభినందన

వేమనపల్లి: ఈ నెల 22నుంచి 24వరకు రామకృష్ణాపూర్‌లోని ఠాకూర్ స్టేడియంలో నిర్వహించిన సీఎం కప్ జిల్లా స్థాయి పోటీల్లో మండల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. వారి వివరాలను ఎంపీపీ కోలి స్వర్ణలత, ఎంపీడీఓ లక్ష్మయ్య, పీఈటీ మల్లేష్ వెల్లడించారు. కంచర్ల లక్ష్మి(కేతన్‌పల్లి-100మీటర్ల లాంగ్‌జంప్, ప్రథమ), చెండే కృష్ణవేణి (నీల్వాయి -400మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ), జెడగళ్ల అంజలి(నీల్వాయి-లాంగ్‌జంప్ తృతీయ), కుబిడె రవి (వేమనపల్లి-లాంగ్‌జంప్ ద్వితీయ), ఖోఖో మహిళా విభాగం నీల్వాయి ప్రథమ, పురుషుల విభాగంలో నీల్వాయి ద్వితీయ స్థానం, కబడ్డీ మహిళా విభా గంలో గొర్లపల్లి ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరు రాష్ట్రస్థాయిలో పోటీలకు ఎంపికవగా పలువురు ప్రజాప్రతినిధులు అభినందించారు.

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావుపేట గ్రామ క్రీడాకారులు సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడాపోటీల్లో కబడ్డీలో పాల్గొని ప్రథమ విజేతలుగా నిలిచినట్లు ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 27న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

బీఆర్క్ ఫలితాల్లో సీఓఈ విద్యార్థుల ప్రతిభ


విష్ణు


శివకుమార్

బెల్లంపల్లి: జేఈఈ మెయిన్స్ బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్ట్(బీఆర్క్) ఫలితాల్లో బెల్లంపల్లిలోని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ) గురుకుల కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. బీఆర్క్ ఫలితాలను గురువారం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ప్రకటించింది. ఈ ఫలితాల్లో సీఓఈ కళాశాల విద్యార్థులు ఇరువురు ప్రతిభా పాటవాలను ప్రదర్శించి జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. సీఓఈ కళాశాల నుంచి ఈ సారి ఇద్దరు విద్యార్థులు బీఆర్క్ ప్రవేశ పరీక్షలు రాశారు. ఆ ఇద్దరు కూడా ఉత్తీర్ణత సాధించారని సీఓఈ కళాశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులు ప్రకటించారు. వీరిలో పొట్టల విష్ణు అనే విద్యార్థి 97.82పర్సంటైల్ తెచ్చుకుని జాతీయ స్థాయిలో 42వ ర్యాంకు కైవసం చేసుకోగా, అల్లూరి శివకుమార్ అనే విద్యార్థి 96.28పర్సంటైల్‌తో జాతీయస్థాయిలో 86వ ర్యాంకు సాధించి మెరిశాడు. ఇరువురు విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు జట్టు ఎంపిక

బెల్లంపల్లి: రాష్ట్రస్థాయి టీ-20క్రికెట్ పోటీలకు బెల్లంపల్లి జట్టు ఎంపికైంది. హైదరాబాద్ శివారు ఘట్‌కేసర్‌లో క్రికెట్ పోటీలు త్వరలో జరగనున్నాయి. ఐదు రోజుల పాటు లీగ్‌కమ్ నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో బెల్లంపల్లి క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం కల్పించినట్లు తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటేశ్వర్లు ప్రకటించారు. ఎంపికైన క్రికెట్ టీమ్ కోచ్‌గా శేఖర్, మేనేజర్‌గా గౌతమ్ వ్యవహరించనున్నారు.

'నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు'


మాట్లాడుతున్న ఎస్సై ఉపేందర్

జైపూర్: విత్తన డీలర్లు రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై ఉపేందర్ తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న ఫెర్టిలైజర్స్ డీలర్లకు వ్యవసాయశాఖ, పోలీస్‌శాఖ సంయుక్తంగా గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో మార్క్‌గ్లాస్టన్‌తో కలిసి పాల్గొన్న ఎస్సై ఉపేందర్ డీలర్లను ఉద్దేశించి మాట్లాడారు. నాణ్యమైన విత్తనాలను రైతులకు విక్రయించాలని, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలన్నారు. విత్తన గోదాంలను శుభ్రంగా ఉంచాలని, స్టాక్ రికార్డులు, బిల్లు బుక్కులు ఎప్పటికప్పుడూ సరి చూసుకోవాలన్నారు. తెలియని వ్యక్తులకు పురుగు మందులు విక్రయించొద్దని సూచించారు. విత్తనషాపుల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు కొమురయ్య, అరుణ, ఆయా గ్రామాల ఫెర్టిలైజర్స్ డీలర్లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నెన్నెల: మండలంలోని ఆవుడంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ రమాదేవి, సర్పంచ్ చీర్ల సత్తమ్మతో కలిసి గురువారం ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలన్నారు. కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రతాప్‌రెడ్డి, బేతు పాపయ్య, ఉపసర్పంచ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాద గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గురువారం వరిధాన్యాన్ని ఏఈవో సాగర్ పరిశీలించి, వరిధాన్యంలో నాణ్యతా ప్రమాణాలపై రైతులకు అవగాహన కల్పించారు. పచ్చిరొట్ట ఎరువుల వల్ల కలిగే లాభాల గురించి వివరించారు. ఎరువులు, పురుగుల మందులు విచక్షణ రహితంగా వాడొద్దని తెలిపారు. నిషేధిత పత్తి విత్తనాలు వాడకూడదని, వాటి వల్ల కలిగే అనర్థాల గురించి తెలియజేశారు. వానాకాలంలో కంది, పత్తి సాగు విస్తీర్ణం పెంచాలని వివరించారు. వరిపంట సాగులో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు.

వ్యవసాయ సమాచారం

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

భీమారం: మండలంలోని రైతులకు జీలుగవిత్తనాలు సబ్సిడీపై అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని ఏవో మార్క్‌గ్లాడ్‌స్టన్ గురువారం తెలిపారు. వరిపంట వేసే ముందు జీలుగ విత్తనాలు వేసి దున్నితే భూమి ఎంతో సారవంతంగా మారుతుందన్నారు. సబ్సిడీ పోను 30కిలోల బ్యాగు రూ.863 ఉంటుందని ఆసక్తి గల రైతులు భీమారంలోని ఆగ్రోస్ కేంద్రం ద్వారా పొందవచ్చునని తెలిపారు.

'రైతులు ఆందోళన చెందొద్దు'


లక్ష్మీపూర్‌లో ధాన్యం పరిశీలిస్తున్న తహసీల్దార్

భీమిని: రైతులు ఆందోళన చెందవద్దని ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని తహసీల్దార్ లక్ష్మీరాజయ్య అన్నారు. మండలంలోని లక్ష్మీపూర్ పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నారాయణ, ఆర్ఐ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

సింగరేణి కళాశాలల్లో నాణ్యమైన విద్య


మాట్లాడుతున్న అధ్యాపకురాలు నస్రీం

మందమర్రిరూరల్: సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో సింగరేణీయుల ఆడపిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం నెలకొల్పిన సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలల్లో నాణ్యమైన విద్యాబోధన ఉంటుందని కళాశాల అధ్యాపకురాలు నస్రీం అన్నారు. మందమర్రి ఏరియాలోని కేకే-5గని ఆవరణలో గురువారం గని మేనేజర్ భూశంకరయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఉద్యోగులు పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం కార్పొరేట్ కళాశాలలను ఆశ్రయిస్తూ, లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నారన్నారు. సింగరేణి ఉద్యోగుల ఆడపిల్లల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సింగరేణి కళాశాలలో సంరక్షణతో పాటు నాణ్యమైన చదువు అందిస్తున్నామన్నారు. సింగరేణి ఉద్యోగుల పిల్లలను కళాశాలలో చేర్పించి సంస్థ అందించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కళాశాల అధ్యాపకురాళ్లు పుష్పలత, విమల, గని సంక్షేమాధికారి కార్తీక్, యూనియన్‌ల ప్రతినిధులు ఉన్నారు.

శంకర్‌పల్లిలో ఉచిత వైద్య శిబిరం


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జీఎం మోహన్‌రెడ్డి

మందమర్రిరూరల్: మండలంలోని శంకర్‌పల్లిలో సింగరేణి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయగా ఏరియా జీఎం మోహన్ రెడ్డి, సర్పంచ్ సదితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ సమీప గ్రామాల అభివృద్ధిలో భాగంగా గ్రామస్తుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత ఆర్యోగ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలి పారు. సింగరేణి వైద్యులు గ్రామస్తులను పరీక్షించి అందుబాటులో ఉన్న మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్వోటు జీఎం రాజేశ్వరరెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డీవైసీఎం డాక్టర్ ఉషా, డాక్టర్ జనార్దన్, కేకే-5గని మేనేజర్ భూశంకరయ్య, డీవైపీఎం మైత్రేయబంధు, యూని యన్‌ల ప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

నేరాల నియంత్రణకే 'కమ్యూనిటీ కాంటాక్ట్'


అవగాహన కల్పిస్తున్న రూరల్ సీఐ రాజ్‌కుమార్

నెన్నెల: నేరాల నియంత్రణకే 'కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం' నిర్వహిస్తున్నట్లు బెల్లంపల్లి రూరల్ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. రామగుండం సీపీ ఆదేశాల మేరకు నెన్నెల మండలంలోని కోణంపేటలో గురువారం తెల్లవారుజామున కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసులు ఉన్నది ప్రజల రక్షణకేనని, ప్రజలకు పోలీసులు భద్రత, భరోసా కల్పించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే, పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. చాలామంది యువకులు ఆన్‌లైన్ మోసాలకు బలవుతున్నారని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని యువతకు అవగాహన కల్పించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, గ్రామాభివృద్ధికి పాటుపడాలని కోరారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా 100కు ఫోన్ చేయాలని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు సరైన ధ్రువపత్రాలతో పాటు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని వ్యాపార సముదాయాల వద్ద, చౌరస్తాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. యువత గుట్కా, జూదం, నాటుసారా, గంజాయి లాంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఒకసారి పోలీసు కేసు నమోదు అయితే ప్రైవేట్ జాబ్ కూడా రాలేని పరిస్థితి ఉంటుందన్నారు. కార్యక్రమంలో నెన్నెల ఎస్సై శ్యాంపటేల్, బెల్లంపల్లి టూటౌన్ ఎస్సై రవికుమార్, 20మంది పోలీసులు పాల్గొన్నారు.

గడపగడపకూ కాంగ్రెస్

దండేపల్లి: మండలంలోని గూడెంలో గురువారం గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఇంటింటికీ వెళ్లి, ప్రజలతో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

సరుకులు పంపిణీ

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని విధులు నిర్వహించే పారిశుధ్య కార్మికులకు మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ గురువారం సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్, మేనేజర్ రాజశేఖర్, అజీం పాల్గొన్నారు.

నీరా కేఫ్ మంజూరుపై హర్షం

మంచిర్యాలటౌన్: జిల్లాలో నీరా కేఫ్ ఏర్పాటుకు రాష్ట్ర ఎక్సైజ్, యువజన క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ హామీ ఇవ్వడంపై జిల్లా గౌడ కులస్తుల నాయకులు గాజుల ముఖేశ్ గౌడ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

పోస్టర్ ఆవిష్కరణ

లక్సెట్టిపేట/నస్పూర్: సీపీఐ ఆధ్వర్యంలో జూన్-4న కొత్తగూడెంలో నిర్వహించే 'చలో కొత్తగూడెం' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను గురువారం ఆ పార్టీ నాయకులు నస్పూర్, లక్సెట్టిపేటలో ఆవిష్కరించారు. అధిక సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

31న సర్వసభ్య సమావేశం

చెన్నూర్‌రూరల్: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 31న బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో టి.శ్రీనివాస్ తెలిపారు.

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా తిరుపతిరెడ్డి

మందమర్రిరూరల్: మండల బీఆర్ఎస్ అధ్యక్షుడిగా అందుగులపేట గ్రామ సర్పంచ్ ఏనుగు తిరుపతిరెడ్డి నియమితులయ్యారు.

జ్వర బాధితులకు పరామర్శ

చెన్నూర్‌రూరల్: మండలంలోని కన్నెపల్లిలో జ్వరాలతో బాధపడుతున్న వారిని గురువారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి అందుగుల శ్రీనివాస్ పరామర్శించారు.

దశాబ్ది ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలి

జైపూర్: అన్ని గ్రామాల్లో జూన్ 2నుంచి 22వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బల్మూరి అరవిందర్‌రావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ సునిత అధ్యక్షతన ఆయా గ్రామాల కమిటీల అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కమిటీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

అంగన్‌వాడీలో వైద్య శిబిరం

మంచిర్యాలటౌన్: రాష్ట్రీయ బాలస్వస్థ్య కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఏసీసీ 3అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం వైద్య ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ రజిత, చిన్నారులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి, పిల్లల్లో ఎనిమియా, పుట్టుకతో వచ్చే వ్యాధులు, ఎండాకాలంలో ఎదురయ్యే చర్మ సంబంధిత వ్యాధులకు సంబంధించిన ఆరోగ్య పరీక్షలు చేశారు.

ఆవిర్భావ దినోత్సవం

పాతమంచిర్యాల: వాడబలిజల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని వాడ బలిజ సేవాసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోడంకి చందు అన్నారు. జిల్లా కేంద్రంలోని అండర్‌బ్రిడ్జి వద్ద గురువారం వాడబలిజ సేవా సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ సంఘం జెండాను జిల్లా అధ్యక్షుడు బొడంకి మహేష్, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎర్రోళ్ల మల్లయ్యతో కలిసి ఆవిష్కరించారు.

చెక్కు అందజేత

భీమిని: కన్నెపల్లి మండలంలోని కొట్రంగి శంకర్ ప్రమాదవశాత్తు చెరువులో పడి మరణించగా ఎస్‌బీఐ ప్రమాదబీమా రూ.20లక్షల చెక్కును భార్య కొట్రంగి లక్ష్మీకి గురువారం అందజేశారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

భీమిని: కన్నెపల్లిలో పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో 6వ వార్డులో డ్రెయినేజీ నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోందని గ్రామస్తులు వాపోయారు. పారిశుధ్య పనులు చేపట్టాలని గురువారం కార్యదర్శి అఖిలాష్‌కు వినతిపత్రం అందజేశారు.

సైబర్ నేరాలపై అవగాహన

కోటపల్లి: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వెంకట్ సూచించారు. గురువారం బొప్పారంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ సతీశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం

నెన్నెల: నెన్నెల ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శ్యాంపటేల్‌ను గురువారం సేవాలాల్‌సేన జిల్లా అధ్యక్షుడు గుగ్లోత్ మల్లేష్ నాయక్ పోలీస్‌స్టేషన్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్ఛం అందజేసి సన్మానించారు.